క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన అబ్దుల్ కలీమ్



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో అబ్దుల్ కలీమ్

పీలేరురూరల్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వాల్మీకిపురానికి చెందిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ పులివెందులలో కలిశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనకు వచ్చిన సందర్భంగా మంగళవారం రాత్రి అబ్దుల్ కలీమ్ మర్యాదపూరకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా పనిచేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పామిలేటి



ఇన్‌చార్జి తహసీల్దార్ పామిలేటిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నిమ్మనపల్లె : మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ తపస్విని వ్యక్తిగత పనులపై 15 రోజులు సెలవుపై వెళ్లడంతో పాలన వ్యవహారాలకు ఆటంకం లేకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. డీటీ సిరాజుద్దీన్, ఆర్ఐ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



స్నపనతిరుమంజనంలో అర్చకులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో రెండు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్ ఆగమశాస్త్రం ప్రకారం సంప్రదాయబద్ధంగా స్వామికి యాగశాల, పవిత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, స్నపనతిరుమంజనం కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



యూరియా పంపిణీపై ఏఓతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె రూరల్ : మదనపల్లె డివిజన్ పరిధిలోని రైతులకు యూరియా కొరత లేకుండా వ్యవసాయశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఆదేశించారు. బుధవారం మండలంలోని అంకిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రం వద్ద జరుగుతున్న యూరియా పంపిణీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, రైతులకు పంపిణీపై ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది, నాయకులు దొరస్వామినాయు డు, జంగాల రమణ, రైతులు పాల్గొన్నారు.

అగ్రహారంలో 'పొలం పిలుస్తోంది'

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారిణి మంజుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశనగ రైతులకు ఎరువుల యాజమాన్యం, పంట సస్యరక్షణపై అవగాహన కల్పించారు. నత్రజని ఎరువుల వాడకంపై వివరించారు. 20.25 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవాకేంద్రంలో రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

మదనపల్లె సిటీ : యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి కోరారు. మంగళవారం కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని రామలింగారెడ్డి అన్నారు. సుమారు 106 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి, అమరనాథరెడ్డి, లయన్స్‌క్లబ్ భాస్కరాచారి, గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెప్పుకోలేని కష్టం

- మరుగుదొడ్లు లేక మహిళలకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అవెన్యూరోడ్డులోని పబ్లిక్ టాయిలెట్లు

మదనపల్లె సిటీ : ఒకటి.. రెండు.. ఇవీ ప్రకృతి అవసరాలు. దీనికి లింగబేధం లేదు. మగవారు ఏ చెట్టు వెనకో కాలువ పక్కనో వెళ్లి నెట్టుకొస్తున్నారు. ఈ విషయంలో మహిళల కోసం మదనపల్లె పట్టణంలో ప్రత్యేక ఏర్పాట్లు లేవు. వారు ఒకసారి ఇంటి నుంచి బయటకు అడుగుపెడితే తిరిగి వెళ్లే వరకు ఇబ్బంది పడాల్సిందే. మున్సిపల్ అధికారులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఉంది.

డివిజన్ కేంద్రమైన మదనపల్లె పట్టణంలో ఆధునిక హంగులు సంతరించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణవాసుల కనీస అవసరాలకు తగ్గట్టుగా కొన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. ప్రధానంగా కదిరిరోడ్డు, చిత్తూరు, తిరుపతి, బెంగళూరు రోడ్ల ప్రాంతాల బాగా విస్తరించాయి. ప్రధానంగా మహిళలను దృష్టిలో ఉంచుకుని కనీసం అర కి.మీకు ఒకచోట ప్రధాన రహదారులపై మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. మదనపల్లె పట్టణానికి చుట్టుపక్కల నుంచి నిత్యం వచ్చే మహిళల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారింది. వేల సంఖ్యలో విద్యార్థినులు సైతం తమ విద్యా సంస్థలకు నిత్యం వచ్చిపోతుంటారు. బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉంటుంటారు. డివిజన్ కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తుంటారు. అత్యవసర సమయంలో ఎటు వెళ్లాలో కూడా తెలియని పరిస్థితి ఉంటోంది.

మదనపల్లె పట్టణంలో..

పట్టణంలో అవెన్యూరోడ్డు జ్యోతి టాకీసు ఎదురుగా, వారపుసంత అన్నా క్యాంటీన్ వద్ద, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వద్ద మాత్రమే సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసిన మూత్రశాలలు ఉన్నాయి. బెంగళూరు బస్టాండులో మున్సిపల్ కాంప్లెక్స్ రూములో మూత్రశాల ఉంది. ఇక పబ్లిక్ మూత్రశాలలు ఎక్కడ లేవు. ఆర్టీసీ బస్టాండులో కేవలం పురుషులు, మహిళలకు కలిసి నాలుగు మూత్రశాలలు మాత్రమే ఉన్నాయి. పట్టణంలో సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నా వాటిని వినియోగించేందుకు మహిళలు రారు. ఆ పరిసర ప్రాంతాలన్నీ మురికిపట్టి ఉండడం, యాచకులు అక్కడికి చుట్టుపక్కలే తమ స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం దీనికి కారణం. దీనికితోడు పురుషులు, స్త్రీలకు కలిపి ఒకే దగ్గర అటూ ఇటూ ఏర్పాటు చేసి ఉంటాయి. దీంతో అసలే సిగ్గుతో ఉండే మహిళలు పూర్తిగా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మహిళల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కచ్చితంగా ఏర్పాటు చేయాలి



మహిళలకు కచ్చితంగా మూత్రశాలలు, మరుగుదొడ్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలి. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి మహిళలు వస్తుంటారు. అవసరాలకు తగ్గట్లు మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. – జిల్లా లలితమ్మ, ఫోర్డు సంస్థ డైరెక్టర్ మదనపల్లె

మెడికల్ స్టోర్స్ ప్రారంభం



శ్రీ హరి మెడికల్ స్టోర్స్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, డాక్టర్ టీఎస్‌హర్షరెడ్డి

మదనపల్లె రూరల్ : పట్టణంలోని అవెన్యూరోడ్డు, బెంగళూరు బస్టాండు సమీపంలో అక్బరీ ఎస్ఎల్‌టీ కాంప్లెక్స్‌లో శ్రీ హరి మెడికల్ స్టోర్స్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, బ్రాండెడ్ మందులను అందించేందుకు శ్రీ హరి మెడికల్ స్టోర్స్ యాజమాన్యం మదనపల్లెలో తమ 5వ బ్రాంచ్‌ను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు మంచి సేవలందించి, ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. శ్రీ హరి మెడికల్ స్టోర్స్ యజమానులు అబ్బూరి వంశీ, కొల్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మరోతు చంద్ర, పాతకమూరి నాగభూషణం మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులు తమ వద్ద లభిస్తాయని, 24 గంటలు అందుబాటులో ఉండటమే కాకుండా ఫ్రీ హోమ్ డెలివరీ, డిస్కౌంట్ సౌకర్యం తమ ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో యూఎస్‌ఏ డాక్టర్ టీఎస్.హర్షరెడ్డి, శాంతారాం హాస్పిటల్ డాక్టర్ టి.పవన్‌కుమార్, కావేరి హాస్పిటల్ డాక్టర్ ఎస్.రవికుమార్, సిలోయం ఐ హాస్పిటల్ డాక్టర్ శోభానవీన్, వైఎస్సార్ సీపీ నాయకులు సీపీ సుబ్బారెడ్డి, సదాశివరెడ్డి, గుండ్లూరురఫీ, తట్టి శ్రీనివాసులురెడ్డి, సుధాకరరెడ్డి, క్లబ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.ఫిర్దౌస్‌ఖాన్, దేవా తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ తదితరులు

మదనపల్లె రూరల్ : గ్రామపంచాయతీకి దాతలు దానం చేసిన కోట్ల విలువైన భూమిని కాపాడటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, అన్యాక్రాంతమయ్యేందుకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ చల్లా కల్యాణిని కలిసి పంచాయతీ స్థలాన్ని ఇతరుల ఆక్రమణ నుంచి కాపాడాల్సిందిగా వినతిపత్రం సమర్పించారు. అనంతరం పునీత్ మీడియాతో మాట్లాడుతూ తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్ సర్వే నంబర్.88, 89, 91లోని కొంత స్థలాన్ని డి.వెంకటరమణ, డి.తాయారమ్మలు గ్రామ పంచాయతీకి దానంగా ఇచ్చారన్నారు. అయితే ఈ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని ఇతరులకు విక్రయించారని తెలిపారు. 2010లో పంచాయతీ అధికారులు ఆక్రమణదారులపై కోర్టులో క్రిమినల్ కేసు దాఖలు చేశారన్నారు. కేసు విచారణ సమయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం, అవినీతి కారణంగా కోర్టుకు సరైన ఆధారాలు, అవసరమైన పత్రాలు అందించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. దీంతో జూలై 29, 2025న కోర్టులో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోట్ల విలువచేసే పంచాయతీ భూమిని రక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బహుజన యువసేన నాయకులు హరికృష్ణ, జిలానీబాషా, శ్రీనివాసులు, శశికుమార్, వినయ్, ఉదయ్, కుమార్, సాయికిరణ్, జగదీష్, బాలకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కేవీపల్లె : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

మూలన పడిన ఉపాధి హామీ రికార్డులు



ఉపాధిహామీ కార్యాలయం మెట్ల కింద కుప్పలుగా పడేసిన ఉపాధి హామీ రికార్డులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలోని ఉపాధిహామీ కార్యాలయంలో ఉపాధిహామీ పథకానికి సంబంధించిన రికార్డులు మూలన పడ్డాయి. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన ఎంబుక్కులు, మస్టర్లు, రిజిష్టర్లు కుప్పలు కుప్పలుగా తీసుకొచ్చి కార్యాలయం మెట్ల కిందే పడేశారు. గతంలో పలు మార్లు జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభకు సంబంధించి రికార్డులు కూడా చెత్తకుప్పల్లో పడేయడం గమనార్హం. రికార్డులు ఇలా చెత్తకుప్పలు మాదిరిగా పడేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఏపీవో జయరామిరెడ్డిని వివరణ కోరగా గతంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను అక్కడ ఉంచామన్నారు. వీటిని ఏం చేయాలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- తంబళ్లపల్లెకు కృష్ణా జలాలు ఇవ్వకుండానే కుప్పానికి తరలింపు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరువు రైతాంగం జీవితాలను మార్చే ప్రాజెక్టు పథకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి తీరని జల ద్రోహానికి పాల్పడిందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయితే తానే చేపట్టానని చంద్రబాబు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. హంద్రీ-నీవా ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 12 టీఎంసీల కృష్ణా జలాలను తరలించాల్సి ఉన్నా చంద్రబాబు పాలన మొత్తంలో నీటిని అందించింది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 6.4 టీఎంసీల నీటిని అందించామని పేర్కొన్నారు. ఈ నీళ్లనే కాకుండా గండికోట ప్రాజెక్టు నుంచి జిల్లాకు 13 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.4,373.23 కోట్లతో గాలేరునగరి-హంద్రీనీవా అనుసంధానం పనులు చేపట్టి రూ.1,100 కోట్ల పనులు పూర్తి అయ్యాక కూటమి ప్రభుత్వం పనులను నిలిపివేసి రైతాంగానికి ద్రోహం చేసిందని మండిపడ్డారు. దీనితో జిల్లాకు దక్కాల్సిన మరో 13 టీఎంసీల నీటిని తరలించుకోలేని పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శ్రీశైలం నుంచి చెర్లోపల్లె రిజర్వాయర్ ద్వారా జిల్లాకు దక్కాల్సిన 12 టీఎంసీల నీళ్లు దక్కడం లేదని, ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యమని తప్పుబట్టారు. హంద్రీనీవా, గాలేరు-నగరి అనుసంధానంతో తరలించే కృష్ణా జలాలను కొత్తగా చేపట్టిన ముదివేడు, ఆవులపల్లె, నేతికుంటపల్లె రిజర్వాయర్లకు తరలించి ఆయకట్టు భూములు సాగులోకి తేవాలని నిర్ణయించగా కుట్రలతో టీడీపీ నేతలు పనులు అడ్డుకుని రైతాంగానికి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గండికోట నుంచి తరలించే 13 టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని రూ.1,217 కోట్లతో చేపట్టిన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులను కూడా కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో కృష్ణా జలాల సద్వినియోగం పూర్తి ఆగిపోయిందన్నారు. కరువుకు నిలయమైన తంబళ్లపల్లె నియోజకవర్గానికి చుక్కనీరు వదలకుండా నీటిని కుప్పానికి తరలిస్తున్నారని తెలిపారు. తక్షణమే తంబళ్లపల్లె రైతాంగానికి సాగుకోసం నీటిని చెరువులకు మళ్లించాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

తంబళ్లపల్లె : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలో పర్యటించారు. రెడ్డికోట పంచాయతీ మేకలవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొప్పలవారిపల్లెలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త శ్రీనివాసులురెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చి పరామర్శించారు. తర్వాత మర్రిమాకులపల్లె పంచాయతీ కుడుములవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి సిద్దారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం నాయకులతో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కూటమి ప్రభుత్వ అరాచపు పాలన, అక్రమ కేసులతో బెదిరింపులు, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డికోట రామస్వామి, జగదీష్, భార్గవ్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లికార్జున, తాళ్ల చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు జ్యోతి, వేమారెడ్డి, కిషోర్‌రెడ్డి, సురేంద్రనాథ్, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఈవోపై ఫిర్యాదు



డీపీవోకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్

పీలేరు : గతంలో పీలేరు గ్రామ పంచాయతీ ఈవోగా పని చేసిన గురుమోహన్‌పై సర్పంచ్ హబీబ్‌బాషా బుధవారం డీపీవో రాధమ్మకు ఫిర్యాదు చేశారు. గురుమోహన్ ఈవోగా ఉన్న సమయంలో ప్రతి నెలా గ్రామ పంచాయతీ వాహనాలకు డీజిల్ బిల్లుల రూపంలో రూ. 1.80 లక్షలు డ్రా చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం అదే వాహనాలకు నెలకు రూ. 1.20 లక్షలు మాత్రమే చెల్లించడం జరుగుతోందన్నారు. ఈ లెక్కన ప్రతి నెలా ఒక్క డీజిల్ బిల్లుల రూపంలోనే ఈవో గురుమోహన్ రూ. 60వేలు డ్రా చేసి స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఈవో తన ఇంట్లో పని మనుషులుగా, సొంత వాహనానికి డ్రైవర్‌గా పని చేయించుకున్నారని తెలిపారు. తనకు చెందిన రెండు సొంత వాహనాలకు పంచాయతీ సొమ్ముతో ఇంధనం నింపుకుని పంచాయతీకి తీవ్ర నష్టం కల్గించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె రూరల్ : నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. నేత్రదానం పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరిండెంట్ కోటేశ్వరి మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం దక్కుతుందన్నారు. మరణానంతరం కూడా ఇతరుల కళ్లలో జీవించి ఉండటం నేత్రదానంతోనే సాధ్యపడుతుందన్నారు. నేత్రదానం చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. నేత్రదానానికి అన్ని వయసుల వారు అర్హులేనన్నారు. నేత్రదానంపై ఉన్న మూఢనమ్మకాలను వీడి..వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేత్రవిభాగం టెక్నీషియన్ ఆజాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ : నేత్రదానం చేయడం ద్వారా వారి నేత్రాలతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని డిప్యూటీ హెచ్ఈఓ మహమ్మద్‌రఫీ అన్నారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నేత్రదానంపై అవగాహన ర్యాలీ మరియు మానవహారం ఏర్పాటు చేశారు. జిల్లా అంధత్వ నియంత్రణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నేత్రదానం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. మరణించిన వారి నేత్రాలతో అంధులకు చూపు తెప్పించవచ్చని కలకడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, మోహన్ తెలిపారు. నేత్ర దానం కోసం ముందుగానే నమోదు చేసుకోనవసరం లేదని, మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుల ఆమోదంతో కూడా నేత్ర దానం చేయ వచ్చని వివరించారు. వ్యక్తి మరణించిన ఆరు గంటలలోపు నేత్రాలను వేరుచేస్తే ఇతరులకు అమర్చే అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయభారతి ,ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పుష్పకుమారి, అధ్యాపకులు రమణ, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు



ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూనియన్ నాయకులు

పీలేరు : ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల బాధ్యతలు తప్పించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గుర్రం మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లోకనాథరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పీలేరు మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులను పలు రకాల యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, శిక్షణా తరగతులంటూ ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పత్రాలు ఉపాధ్యాయులకు అగ్ని పరీక్షగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు అరవ వేణుగోపాల్‌రెడ్డి, కొల్లు భాస్కర్‌రెడ్డి, బాలా వెంకటరమణ, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయరాంనాయక్, బాలకృష్ణారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలపై పరిశోధనలు అవసరం



మాట్లాడుతున్న అమృత్‌కుమార్‌రెడ్డి

కలకడ : వ్యవసాయంలో కొత్త వంగడాలకు పరిశోధనలు అవసరమని వాల్మీకిపురం బ్లాక్ ఆత్మ బీటీఎం అమృతకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముడియంవారిపల్లె రైతుసేవాకేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. కేవలం యూరియాపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా నానో ఎరువులను రైతులు వినియోగించుకోవాలని, నానో ఎరువులతో పర్యావరణ సమతుల్యత ఉంటుందని అన్నారు. ప్రతి పంటకు రైతుసేవా కేంద్రాలలో రైతులు పంట నమోదు చేయించాలని సూచించారు. నూతన రకం ఎరువులు నానో యూరియా, డీఏపీ, పీఎస్‌బీ, కేఆర్‌బీ, సూడోమోనాస్ అందుబాటులో ఉన్నాయని వాటి వినియోగం వలన భూసారం పరిరక్షించబడుతుందని తెలిపారు. ఈ దిశగా రైతులు ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, రైతుసేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.